మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 1,4,6,13,17,18,23 డివిజన్‌ల్లో రూ 1.20 కోట్ల వ్యయంతో మంగళవారం చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల శంకుస్థాపనకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఆదర్శనగర పాలక సంస్థగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్‌కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో నిధులు మంజూరు చేయించి రా చెరువు, అల్మాస్ కుంట, చింతల చెరువులకు సుందరీకరణ పనులు చేపట్టి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే విధంగా తీర్చిదిద్దు తామన్నారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, బింగి జంగయ్యయాదవ్, దానగల్ల అనిత యాదగిరి, పులకండ్ల హేమలతాజంగారెడ్డి, రాసాల వెంకటేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపులో సమన్వయం చేసుకోవాలి



శానిటేషన్ అధికారులు, రాంకీ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో చెత్త తొలగింపులో శానిటేషన్ విభాగం, రాంకీ నిర్వాహకులు సమన్వయం చేసుకోవాలని కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో చెత్త తరలింపులో ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాంకీ సంస్థ నుంచి చెత్త తరలించే వాహనాలు సకాలంలో రాకపోవడంతో వీధుల్లో చెత్త తరలింపులో ఇబ్బందులు ఉన్నాయని శానిటేషన్ అధికారులు ఆయనకు తెలిపారు. సకాలంలో వాహనాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని పరిస్థితిలో మార్పురాకపోతే తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. అనంతరం సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణ త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పాండ్‌లో విగ్రహాలు మునగడానికి వాటర్ లెవెల్స్ తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఎఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, ఏఈ దీపక్, విజ రమేష్, గిరి, ఎల్లయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు

యాదవ సంక్షేమ సంఘం యూత్ కన్వీనర్‌గా వరుణ్

రామంతాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి యాదవ సంక్షేమ సంఘం యూత్ కన్వీనర్‌గా రామంతాపూర్‌కు చెందిన చందు వరుణ్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర యాదవ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీనవేని మల్లేష్ యాదవ్, యూత్ అధ్యక్షుడు గంగుల మధుయాదవ్ మంగళవారం వరుణ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ.. జిల్లాలో యాదవ సామాజికవర్గం ఐక్యతకు, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.



వరుణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

మెగా కళాశాల విద్యార్థినుల నిరసన ర్యాలీ



కుషాయిగూడ: కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ మంగళవారం ఈసీఐఎల్‌లోని మెగా జూనియర్ కళాశాల విద్యార్థినులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతా వైద్యురాలి ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసిందని ప్రిన్సిపాల్ కనకవల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సీతారాంరెడ్డి, సిబ్బంది రాజనారాయణరెడ్డి, పలుగుల రజని, మాధురి, ప్రియాంక, ఉన్నీసా, మహాలక్ష్మి, స్వప్న, రాజారావు, రజిత, సమీరా, అయూషాబేగం, రోహిణి, వీరారెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి విజయకుమారి

మల్కాజిగిరి: దివ్యాంగులకు అలిమ్‌కో ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల పంపిణీని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి ఐ. విజయకుమారి సూచించారు. మంగళవారం మల్కాజిగిరి బాలుర పాఠశాల ఆవరణంలో ఉపకరణాలు అందజేసేందుకు ఏర్పాటు చేసిన నిర్ధారణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల్లో శారీరక వైకల్యం, అంధత్వం, వినికిడి లోపం, మానసిక వైకల్యం, మస్తిష్క పక్షపాతం గల విద్యార్థులతో పాటు ఇతరుల (18 సంవత్సరాలలోపు ఉన్నవారు)కి ఖరీదైన ఉపకరణాలు ఉచితంగానే అలిమ్‌కో అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శశిధర్, కోఆర్డినేటర్స్ జాకబ్, అయ్యన్న, లత, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లితండ్రులు హాజరయ్యారు.

నోట్ పుస్తకాల పంపిణీ

రామంతాపూర్: జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌తో పాటు నగదు పారితోషికాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉన్నత లక్ష్యంతో పై చదువులు చదవడానికి ఆసక్తి గల విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ ట్రస్ట్ 26 ఏళ్ల నుంచి 'లక్ష్యం మీది..చేయూత నాది'అని నినాదంతో పని చేస్తూ ఎంతో మంది పేద విద్యార్థులకు ఆదుకుందన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన గృహిణి మృతి

ఉప్పల్: వరకట్న వేధింపులు భరించ లేక ఆత్మహత్యకు యత్నించిన గృహిణి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. ఉప్పల్ సత్యానగర్‌కు చెందిన బొడ్డుపల్లి శివకోటయ్యచారి(34) ప్రైవేట్ ఉద్యోగి. స్వస్థలం మిర్యాలగూడ తుంగపాడు. నల్గొండ జిల్లా కేతపల్లికి చెందిన అక్కెనపల్లి వాసవి(30)తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో 14 తులాల బంగారం, కిచెన్ వస్తువులు రూ. 2లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. వీరికి కుమారుడు వేధిక్ సాయి ఉన్నాడు. అదనపు కట్నం కోసం కొన్ని నెలలుగా భార్యతో గొడవపడుతున్నారు. పెద్దలు మాట్లాడి వెళ్లారు. కానీ కట్నం సమస్య తీరలేదు. ఈనెల 25న మధ్యాహ్నం గొడవ తారా స్థాయికి చేరింది. దీంతో వాసవి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యయత్నం చేసింది. కుటుంబసభ్యులు వెంటనే వాసవిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తక పఠనం..మెరుగైన ఫలితం!

- కరోనాలో ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థుల్లో తగ్గిన పుస్తక పఠనం
- రెండేళ్లుగా ప్రభుత్వ బడుల్లో రీడింగ్ క్యాంపెయిన్‌తో మెరుగైన ఫలితం
- ఇళ్లలోనూ పుస్తక పఠనంపై విద్యాశాఖ ప్రత్యేక శ్రద్ధ
- తల్లిదండ్రుల ప్రత్యేక శ్రద్ధతో ఇంటి వద్ద దృష్టి సారించేలా చర్యలు
- పాఠశాల నుంచి మానిటరింగ్‌కు ప్రత్యేక టీచర్‌ను నియమించేలా కసరత్తు



ప్రభుత్వ బడుల్లో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో నిర్వహించిన ఆన్‌లైన్ తరగతులతో విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గి సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వీక్షణం పెరిగింది. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ రంగప్రవేశంతో విద్యార్థుల్లో పుస్తక పఠనాశక్తి పడిపోతోంది. అతి వినియోగంతో కంటి రుగ్మతలతో పాటు ఇతర సమస్యలు కొనితెచ్చుకుంటున్నారు. సెలవు రోజుల్లోనూ డిజిటల్ తెరలకే అతుక్కుపోతున్నారు. దీంతో వారి అభ్యాసన సామర్థ్యాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నుంచి పిల్లలను బయటకు తీసుకురావడానికి విద్యాశాఖ పాఠ్యపుస్తక పఠనం, రాయడంపై శ్రద్ధ చూపాలని భావిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలో 2,447 పాఠశాలలు ఉండగా, ఇందులో హైదరాబాద్ జిల్లాలో 631 పాఠశాలలు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 515 పాఠశాలలు, రంగారెడ్డి జిల్లాలో 1,301 పాఠశాలలు ఉన్నాయి. రెండేళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పఠనా శక్తిని పెంచటంతోపాటు నైపుణ్యాన్ని పెంపొందించటానికి 'చదువు–ఆనందించు–అభివృద్ధి చెందు' అనే నినాదంతో రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహిస్తోంది.

- విద్యాశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుండటంతో ఇక ఇళ్లల్లో కూడా విద్యార్థులకు పుస్తక పఠనానికి అనుకూల వాతావరణం కల్పించేలా తల్లిదండ్రులు వ్యవహరించాలని సమావేశాలు నిర్వహిస్తోంది.

తల్లిదండ్రులు ఇలా చేయాలి...

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు ఇది వరకే ప్రభుత్వ బడుల్లో 'రీడింగ్ క్యాంపెయిన్లు, కార్నర్స్ ఏర్పాటు చేశారు. ఇంట్లో కూడా దీన్ని ఏర్పాటు చేయాలని పీటీఎం సమావేశాల్లో వివరిస్తున్నామని విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. తల్లిదండ్రులు పిల్లల్ని ఇంటి వద్ద రోజూ కొంత సమయం చదివిస్తే అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడి మంచి ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయని భావిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



ఇంటికి రాగానే తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఆరా తీయాలి. ఆ రోజు ఏం నేర్చుకున్నారు? హోంవర్క్ ఇచ్చారా? అని పరిశీలించాలి. అభ్యాసన తీరు గమనించాలి. పిల్లలు సౌకర్యవంతంగా చదువుకోవడానికి కుర్చీలు, బల్లలు వంటి సదుపాయాలు కల్పించాలి. రీడింగ్ కార్నర్ వద్ద సరైన గాలి, వెలుతురు ఉండేలా చూడాలి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాల్ని కంఠస్థం చేసేలా రోజూ ప్రోత్సహించాలి. పిల్లలు పెద్దలను అనుకరిస్తారు. పెద్దలు నిత్యం టీవీ, సెల్‌ఫోన్లు వాడుతూ కనిపిస్తే పిల్లల ఏకాగ్రత దెబ్బతింటుందని గ్రహించాలి. వ్యక్తిత్వ వికాసం, బొమ్మల కథలు, పరిసరాల విజ్ఞానం, శాస్త్రసాంకేతిక రంగాలపై బాలలస్థాయి పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలి.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

- తొలి పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం)లో ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఇంటివద్ద పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 'రీడింగ్ కార్నర్లు' ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది.

ప్రశాంత వాతావరణం...

ప్రైవేటు బడుల్లో చదివే పిల్లలకు వారి తల్లిదండ్రులు ఇంటి వద్ద హోంవర్క్ చేసుకునేలా అందుకు కావాల్సిన రీడింగ్ కార్నర్ వంటి అనుకూల వాతావరణం కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. దీన్ని మార్చేందుకు పిల్లలు ఇంటికి రాగానే వారిపై ప్రత్యేక దృష్టి సారించి చదివేందుకు ఇంట్లోనే ప్రత్యేక ప్రదేశాన్ని ఏర్పాటు చేయాలి. ఆ సమయంలో టీవీలు, రేడియో, సెల్‌ఫోన్లు వినియోగించవద్దని సూచించారు.

ఎమ్మెల్యేకు వినతి



అల్వాల్: వెంకటాపురం డివిజన్ సాయిదత్త కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. కాలనీలో సీసీ రోడ్లు, బాక్స్ డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ సదుపాయాలు కల్పించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కిషోర్, కాలనీవాసులు షేక్ ఖయ్‌రున్, సుధాకర్, శ్రీనివాస్, మోహన్‌రావు, ఇబ్రహీం, సద్దామ్, కవితారెడ్డి, కల్పన పాల్గొన్నారు.

చెరువులు, నాలాలను పరిరక్షించాలి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గంలో అన్యాక్రాంతమవుతున్న చెరువులు, నాలాలు ఎఫ్‌టీఎల్, బంఫర్ జోన్‌లను పరిరక్షించాలని కోరుతూ మంగళవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో తెలంగాణ టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సూర్జం రాజేష్ వినతిపత్రం అందజేశారు. కాప్రా, చర్లపల్లి, నాచారం హెచ్‌ఎంటీనగర్ చెరువు పటేల్‌కుంట, ఎర్రకుంట, చెరువులతో పాటు నాలాలు, ఎఫ్‌టీఎల్, బంఫర్ జోన్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగించాలని వినతిపత్రంలో కోరారు.

ఉప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్‌గా వంశీ



ఉప్పల్: ఉప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ కన్వీనర్‌గా అరిటికాయల వంశీకృష్ణ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ విభాగాలను, మండప నిర్వాహకులతో మమేకమై ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు.

బాలుడిపై కుక్కల దాడి

మల్లాపూర్: ఆరుబయట ఆడుకుంటున్న ఓ బాలుడిని వీధి కుక్కల ఒక్కసారిగా దాడి చేశాయి. మల్లాపూర్ గ్రీన్ హిల్స్ కాలనీలో సోమవారం జరిగిన ఘటన మరువక ముందే మళ్లీ మల్లాపూర్ ఎస్వీనగర్‌లో ఓ బాలుడిపై ఎగబడ్డాయి. వివరాలులోకి వెళ్తే.. హరిష్ మాంఝై కుమారుడు క్షితజ మాంఝై(03) ఇంటి ముందు ఆడుకుంటుడంగా ఒక్కసారిగా కారు కింద ఉన్న వీధి కుక్కలు బాలుడిపై దాడి చేశాయి. హుటాహుటిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువెళ్లి టీకా ఇంజక్షన్ వేయించారు.

బొలెరో వాహనాన్ని ఢీకొన్న రెడీమిక్స్ లారీ

ముగ్గురికి గాయాలు

మేడిపల్లి: రెడీమిక్స్ లారీ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఇబ్రహీంపట్నం రాయప్రోల్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చెంగిచెర్ల మేకలమండికి బొలెరోలో వెళ్తుండగా కాచవాని సింగారం గ్రామం వద్ద మూలమలుపు వద్దకు రాగానే రెడీమిక్స్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బొలెరో డ్రైవర్ ఈశ్వర్ తలకు బలమైన గాయాలు కాగా వాహనంలో ప్రయాణిస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కుషాయిగూడ: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని భారత్‌గ్యాస్ ఎల్పీజీ కంపెనీలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు కంటి, దంత పరీక్షలతో పాటుగా డయాగ్నొస్టిక్, కేన్సర్ స్క్రీనింగ్, బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పలువురు కార్మికులు రక్తదానం చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్లానెట్ ఆప్టికల్స్, పద్మసాయి డెంటల్ ఆసుపత్రి, సన్‌సీడ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్, డాక్టర్ దినేష్, డాక్టర్ అన్వేష్‌లు వైద్య పరీక్షలు చేయగా క్లబ్ అధ్యక్షురాలు ఎం. శ్రీదేవి, కంతేటి విజయ్‌కుమార్, చందన్‌రాజు, శ్రీనివాసరెడ్డి, రోజీ, సునీల్‌తో పాటుగా భారత్ గ్యాస్ సిబ్బంది అనిత్ మోహన్, రమణకుమార్, వేదప్రకాశ్, నందన్వార్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి



సూర్యానగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి తదితరులు

ఉప్పల్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీవాసులతో కలిసి స్థానిక సమస్యలపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్ స్పందిస్తూ వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు జెట్ట సుధాకర్, రాకేష్‌రెడ్డి, దేవి రెడ్డి, వెంకటేశ్వర్లు, కంచేమీది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



సదస్సును ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత చేవూరి

మేడిపల్లి: నేటి ఆధునిక సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న టెక్నాలజీని ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంజనీరింగ్ విద్యతో పాటు ఎప్పటికప్పుడు మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ముందు చూపుతో అందిపుచ్చుకోవడంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని అరోరా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత చేవూరి అన్నారు. మంగళవారం పర్వతాపూర్‌లోని అరోరా డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఏఐసీటీ సహకారంతో ఆరు రోజుల పాటు నిర్వహించే 'సాంకేతికతను పెంపొందించడం.. అభివృద్ధిని నడిపించడం'అనే శీర్షికపై జరిగిన ప్రోగ్రాంకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ ఆర్ హఫీజ్ భాషా, ప్రొఫెసర్ వెంకటరయణ విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యత వల్లనే పదికాలాలపాటు నిలుస్తాయని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అన్నారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జుననగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మేకల సునీతరాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గౌతంనగర్ డివిజన్ పరిధిలో ప్రతి కాలనీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిరాములు, బైరు అనిల్, మల్లేష్‌యాదవ్, నర్సింగ్, శ్రీరాముడు యాదవ్, శ్రీను, శంకర్, సతీష్, సూర్యప్రకాష్, శ్రీనివాస్, కృష్ణయాదవ్, భాను, బాచి తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా బొంతు శ్రీదేవి



నియామకపత్రాన్ని అందుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి నియామితులయ్యారు. మంగళవారం జరిగిన సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. అఖిల భారత యాదవ మహాసభలో తనకు గురుతర బాధ్యతను అప్పగించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా తన బాధ్యత పెరిగిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి యాదవ మహిళలను విద్య, రాజకీయ రంగాల్లో చైతన్య పరుస్తానన్నారు. యాదవులను ఐక్యం చేసి హక్కుల సాధన కోసం కృషిచేస్తానన్నారు.

సమాజ అభివృద్ధికి చేయూతనిద్దాం

బోడుప్పల్: సొంత నిధులతో సమాజ అభివృద్ధికి చేయూతనిద్దామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పిలుపునిచ్చారు. బోడుప్పల్ 10వ డివిజన్ కార్పొరేటర్ బొమ్మక్ సుగుణ, బాలయ్య దంపతులు మెక్ డోవెల్ కాలనీకి 100 గజాల స్థలం విరాళం అందజేసి, కాలనీవాసుల కోసం రూ.15.30 లక్షల సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ అజయ్‌యాదవ్ మాట్లాడుతూ..సుగుణ బాలయ్య ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిన పనులన్నింటిని పూర్తి చేశారని, వారిని ఆదర్శంగా తీసుకుని మిగతా ప్రజాప్రతినిధులు ముందుకు నడవాలన్నారు. కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణ, దొంతరబోయిన మహేశ్వరి, హ్యాట్రిక్ వార్డు సభ్యులు బొమ్మక్ బాలయ్య, మేడ్చల్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దొంతరబోయిన కృపాసాగర్, కాలనీ అధ్యక్షుడు యాదిరెడ్డి పాల్గొన్నారు.

భారతినగర్ కాలనీకి న్యాయం చేయండి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలోని భారతినగర్ కాలనీవాసులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 1996లో కాలనీ స్థలాలు కొన్నామని, అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇప్పుడు రెవెన్యూ శాఖ నుంచి కూల్చివేతలకు నోటీసుల అందాయని తమకు న్యాయం చేయాలని వారు కోరారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, భారతినగర్ కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి

మౌలాలి: పారిశుద్ధ్యం మెరుగు పరచాలని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ పేర్కొన్నారు. మంగళవారం వినాయక్‌నగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఆమె మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజులతో కలిసి ఆమె మాట్లాడుతూ జీవీపీలను తొలగించాలని, చెత్తను రోడ్ల మీద వదిలేయకుండా రాంకీ వారు మధ్యాహ్నమే ఆ చెత్తను ఎత్తివేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది ఎస్ఎఫ్ఏలతో, జవాన్లతో, శానిటరీ పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ఏలియాకు ఉత్తమ సేవా అవార్డు



గౌతంనగర్: అయ్యన్ననగర్ హిల్ చర్చి నిర్వాహకులు, పాస్టర్ బక్క ఏలియాకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఏలియా చేస్తున్న సేవలకు తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం నారాయణగూడలోని బాప్టిస్ట్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.